సంగారెడ్డి మెదక్
ఆదివారం 23 ఆగస్టు 2026 www. praja jyothi news.com పేజీలు:08

కల్వర్ట్: ధ్వంసమైన కల్వర్టు.. అడ్డగా కర్రలు.



2

# మెదక్ జిల్లా పోలీసులకు సిపిఆర్ శిక్షణ తరగతులు





**మెదక్ (ప్రజాజ్యోతి)**

అత్యవసర సమయంలో సిపిఆర్ ఎంతో కీలకమని ప్రతి పోలీస్ సిబ్బంది కి సిపిఆర్ పై అవగాహన కలిగి ఉండాలని మెదక్ జిల్లా ఎస్పీ డి వి శ్రీనివాస్ రావు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో అందించే సిపిఆర్ చేసి విలువైన ప్రాణాలను కాపాడాలని పోలీస్ అధికారులు సిబ్బందికి సూచించారు. పోలీసులు నిత్యం ప్రజలతో మమేకమై విధులు నిర్వహిస్తారని ప్రమాదాలు గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో సంఘటన స్థలానికి ముందుగా చేరుకునే అవకాశం పోలీసులకే ఎక్కువగా ఉంటుందని తెలిపారు.యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయం పెరేడ్ గ్రౌండ్లో లో పోలీసులు అధికారులుకు సిబ్బందికి సిపిఆర్ పై శిక్షణ తరగతులు నిర్వహించారు. అత్యవసర సమయాల్లో సిపిఆర్ ని ఎప్పుడు ఎలా చేయాలని అంశాలను వైద్య నిపుణులు ప్రాక్టికల్ గా చేసి చూపించారు. మిగతా 2 లో



# అమీన్ పూర్ ను అభివృద్ధికి ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

**అమీన్ పూర్ (ప్రజాజ్యోతి)**

అమీన్ పూర్ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసి ఆదర్శ ప్రాంతాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, కాలనీల్లో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.శనివారం రాజేంద్ర రెడ్డి కాలనీ, సాయి అంబిక కాలనీ, పీఎన్ఆర్ కాలనీ, నరేంద్ర నగర్, సాయిరామ్ ఎన్క్లేవ్, శంకర్ గ్రీన్ హోమ్స్, బృందావన్ టీచర్స్ కాలనీ, నవ్య నందనవనం, నర్రెగూడెం రాజీవ్ గృహకల్ప కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటించారు. మొత్తం రూ.8.19 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అంతర్గత మురుగు నీటి కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

మిగతా 2 లో

- రూ.8.19 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జీఎంఆర్ శంకుస్థాపన
- కాలనీల్లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే

# మెదక్ జిల్లా పోలీసులకు సిపిఆర్ శిక్షణ తరగతులు

మొదటిపేజీ తరువాయి

సిపిఆర్ చేసే విధానము తీసుకోవలసిన జాగ్రత్తలు డెమో ద్వారా వివరించారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గుండెపోటు లేదా ఇతర కారణాలతో వ్యక్తి అకస్మాత్తుగా స్పృహ కోల్పోయి శ్వాస తీసుకొని పరిస్థితులు ఏర్పడినప్పుడు ఆసుపత్రికి తరలించే లోపు సిపిఆర్ అందించడం ఎంతో కీలకమన్నారు సకాలంలో ఎవరైనా ఈ విధంగా సిపిఆర్ అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని సిపిఆర్ ఎప్పుడు ఎక్కడ అవసరం వస్తుందో చెప్పలేమని అందుకే ప్రతి పోలీస్ అధికారి సిబ్బంది తప్పనిసరిగా సిపిఆర్ పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో ఎక్కడైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే స్పందించి బాధితుడికి అవసరమైన ప్రాథమిక ప్రాణ రక్షణ చర్యలు చేపట్టాలా ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని పోలీస్ లు తమ కుటుంబ సభ్యులు స్నేహితులు ప్రజలకు కూడా సిపిఆర్ ప్రాముఖ్యతను తెలియజేయాలని ఎస్పీ కోరారు ఒక వ్యక్తి ప్రాణాపాయంగా ఉన్నప్పుడు సిపిఆర్ ద్వారా ప్రాణాలను కాపాడగలిగితే అంతకంటే గొప్ప సేవ మరొకటి ఉండదని ఈ శిక్షణ కేవలం కార్యక్రమానికి పరిమితం చేయకుండా అవసరమైన సమయాల్లో ఆచరణ పెట్టాలని సూచించారు ఈ కార్యక్రమంలో డిఎస్పి ప్రసన్నకుమార్ మెదక్ టౌన్ సిఐ మహేష్ ఆర్ఐలు శైలజ రామకృష్ణ ఎస్సైలు పోలీస్ సిబ్బంది యూత్ ఫర్ సేవా ప్రతినిధులు పాల్గొన్నారు.





# అమీన్ పూర్ ను అభివృద్ధికి ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా కాలనీవాసులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సమావేశమై సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, యూజీడీ, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర అంశాలపై అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు.అమీన్ పూర్ లో దశాబ్దాలుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని, కొత్తగా ఏర్పడుతున్న కాలనీలకు కూడా మంచినీరు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ స్థలాలు, పార్కులను ఆక్రమణల నుంచి కాపాడుతూ పచ్చదనం పెంపునకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.పెరుగుతున్న జనాభా, విద్యుత్ అవసరాలకు అనుగుణంగా కొత్త సబ్‌స్టేషన్ లు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ లు ఏర్పాటుపై దృష్టి సారించామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, పనుల నాణ్యతను పర్యవేక్షించాలని కోరారు.ఈకార్యక్రమంలో అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, డీఈ వెంకటరమణ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# కల్హేర్: ధ్వంసమైన కల్వర్టు.. అడ్డుగా కర్రలు.

మొదటిపేజీ తరువాయి

**కల్హేర్. 22.ఆగస్టు. ప్రజా జ్యోతి.**

కల్హేర్: తుకారాం తండా సమీపంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న కల్వర్టు తీవ్రంగా ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు, బాటసారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రమాదాలను నివారించేందుకు స్థానిక రైతులు ముందుజాగ్రత్తగా కల్వర్టు వద్ద కర్రలను అడ్డుగా ఏర్పాటు చేశారు. ముఖ్యంగా రాత్రివేళ ఈ మార్గంలో ప్రయాణించే వారికి కల్వర్టు కనిపించక ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు తెలిపారు.కల్వర్టు దెబ్బతిని చాలా కాలం గడుస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి కల్వర్టుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

# రోస్టర్ పాయింట్ సవరించాలని

మెదక్ (ప్రజాజ్యోతి) రామయంపేట్ టౌన్

మాలల రోస్టర్ ప్యాంట్స్ సవరించాలని సెప్టెంబర్ 7న చలో మెదక్ కలెక్టరేట్కు తరలి రండి అని ఎం సి ఎఫ్ రాష్ట్ర నాయకులు పి శంకర్ విద్యా ఉద్యోగ నియామకాల్లో అమలు చేస్తున్నాం మాలల రోస్టర్ పాయింట్లను సవరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 7న మెదక్ కార్యాలయాన్ని ముట్టడించాలని మాలల రాష్ట్ర కో ఆర్డినేటర్ ఫోరం పిలుపు మేరకు. శనివారం నాడు రామయంపేట్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సర్కిల్లో వద్ద చలో మెదక్ కలెక్టరేట్ కరపత్రం విడుదల చేశారు ఈ సందర్భంగా ఎంసీఎఫ్ రాష్ట్ర నాయకులు పి శంకర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ తర్వాత అమలు చేస్తున్న రోస్టర్ పాయింట్ల వల్ల మాలలకు తీరని అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు మాల రోస్టర్ పాయింట్ లు 22 కేటాయించడం వల్ల జిల్లా స్థాయిలో ఒక్క ఉద్యోగం కూడా రావడం లేదన్నారు మాలల రోసరు పాయింట్లను సవరిశీచడం ద్వారా మాలలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. రోస్టర్ పాయింట్ 22 నుండి 12 కు సవరించాలని కోరారు న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సెప్టెంబర్ 7వ తేదీ మెదక్ జిల్లా కలెక్టరేట్ ముట్టడిస్తున్నామని తెలిపారు. చలో మెదక్ కలెక్టరేట్ విజయవంతం చేయాలని ఈ కార్యక్రమంలో ఎం సి ఎఫ్ జిల్లా నాయకులు సిద్ధిరాములు ఎల్లం బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



# మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో ఘనంగా వన మహోత్సవం

తూప్రాన్ (ప్రజాజ్యోతి) ఆగస్టు 22:

తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం రోడ్డుకు ఇరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పిలుపునిచ్చారు. భావితరాల మనుగడకు పచ్చదనం ఎంతో అవసరమని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. నేటి మొక్క.. రేపటి తరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తు అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి, ఉపసర్పంచ్ స్వామి, టెక్నికల్ అసిస్టెంట్ సురేష్, పాలకవర్గ సభ్యులు జిన్న కృష్ణ, మన్నె తిరుపతి, పిట్ల వేణు, రేఖ నాగరాజుగౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ కనకరాజు, మెకిన్ ప్రెసిడెంట్ కరుణాకర్, యువత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# వెల్దుర్తి పీహెచ్‌సీ సేవలపై డీఎంహెచ్ఓ సమీక్ష

## - సిబ్బంది పెంపు, ఆధునిక వైద్య సేవలకు శ్రీకారం

## - త్వరలో ఎక్స్‌రేస్కానింగ్ సేవలు

## - జిల్లా వైద్యాధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్



వెల్దుర్తి (ప్రజాజ్యోతి) ఆగస్టు 22:

వెల్దుర్తి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. పీహెచ్‌సీలో కొనసాగుతున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలకు అందుతున్న వైద్యం, సిబ్బంది పనితీరు, మందుల లభ్యత, వైద్య పరికరాలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించిన అధికారులు.. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ సకాలంలో వైద్యం అందేలా చూడాలని, అవసరమైన మందులు, వైద్య సదుపాయాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

### సిబ్బంది కొరత త్వరలో పరిష్కారం

వెల్దుర్తి పీహెచ్‌సీలో సిబ్బంది కొరత ఉన్న అంశం తమ దృష్టికి వచ్చిందని డాక్టర్ జ్ఞానేశ్వర్ తెలిపారు. అవసరమైన సిబ్బందిని త్వరలోనే అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. సిబ్బంది బలోపేతంతో పీహెచ్‌సీ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.

### దీర్ఘకాలిక వ్యాధులపై ప్రత్యేక నజర్

హైపర్‌టెన్షన్, డయాబెటిస్, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని వైద్య సిబ్బందికి సూచించారు. వ్యాధిగ్రస్తులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మందుల వినియోగం, ఆహార నియమాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.



### డెంగ్యూ, మలేరియాపై అప్రమత్తత

వర్షాకాలం నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ వైద్య బృందాల ద్వారా సేవలు విస్తరించి, అనుమానిత కేసులను త్వరగా గుర్తించి పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

### త్వరలో మొబైల్ ఎక్స్‌రే, స్కానింగ్ సేవలు

వెల్దుర్తి పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలకు మరింత మెరుగైన వైద్య పరీక్షలు అందించేందుకు త్వరలోనే మొబైల్ ఎక్స్‌రే, స్కానింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు డాక్టర్ జ్ఞానేశ్వర్ ప్రకటించారు. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే అవసరమైన వైద్య పరీక్షలు పొందే అవకాశం ప్రజలకు కలగనుంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం చేరువ చేయడమే లక్ష్యంగా పీహెచ్‌సీని మరింత బలోపేతం చేస్తామని జిల్లా వైద్యాధికారి స్పష్టం చేశారు. అవసరమైన వైద్య సిబ్బంది, పరికరాలను సమకూర్చి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ ఇన్‌చార్జి డాక్టర్ అనిల్ కుమార్, వైద్యాధికారి డాక్టర్ శిరీష, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ జగదాంబ మాత మందిరంలో వైభవంగా సామూహిక కుంకుమార్చన

మెదక్ (ప్రజా జ్యోతి)



పాపన్నపేట మండలం డాక్యా తాండ పరిధిలో గల శ్రీ జగదాంబ మాత సంత్ సేవాలాల్ మహారాజ్ మందిరంలో శనివారం మహిళలు సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం మహిళల భక్తిగీతాలు, పూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. పూజారులు తులసీరాం, ప్రభునాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు పుష్కలంగా పండాలని మహిళలు అమ్మవారిని ప్రార్థించారు. ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ సామూహిక కుంకుమార్చన కార్యక్రమానికి ఈసారి కూడా భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో తాండా పెద్దలు, మహిళలు, యువత, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# డిజిటల్ పంటల నమోదులో కీలక మార్పులు



**రాయికోడ్ ఆగస్టు 22 (ప్రజా జ్యోతి):**

ప్రస్తుత వానాకాలం2026 సీజన్ నుంచి డిజిటల్ పంటల నమోదు (డీసీఎస్) ప్రక్రియలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి.ఇకపై ప్రైవేట్ సర్వేయర్ల ద్వారా క్షేత్రస్థాయిలో పంటల వివరాలను నమోదు చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సారిక తెలిపారు.

### సర్వే నంబర్, సబ్ డివిజన్ వారీగా నమోదు

ప్రైవేట్ సర్వేయర్లు రైతుల పొలాలను స్వయంగా సందర్శించి ప్రతి సర్వే నంబర్,సబ్ డివిజన్ వారీగా వాస్తవంగా సాగులో ఉన్న పంట వివరాలను నమోదు చేస్తారు.పంటకు సంబంధించిన ఫోటోలను సైతం తీసి డిజిటల్ విధానంలో అప్‌లోడ్ చేయనున్నారు.

### క్షేత్రస్థాయిలో ఉన్న పంటకే ప్రాధాన్యం

గతంలో ఏఈఓ లు అందించే పంటల వివరాల ఆధారంగా నమోదు జరిగితే,ఇకపై క్షేత్రస్థాయిలో ప్రైవేట్ సర్వేయర్లు నమోదు చేసిన వివరాలనే అధికారికంగా పరిగణనలోకి తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.పొలంలో పత్తి సాగు చేస్తే పత్తి, వరి సాగు చేస్తే వరి,కంది,పెసర,మినుము తదితర ఏ పంట ఉన్నా అదే పంటను నమోదు చేయనున్నారు.

### పంటల కొనుగోళ్లలో డీసీఎస్ వివరాలే కీలకం

ప్రస్తుత వానాకాలం2026 నుంచి డీసీఎస్ లో నమోదు చేసిన పంటల వివరాలను మార్కెటింగ్ శాఖకు అందించనున్నారు. పంటల కొనుగోలు ప్రక్రియలో ఈ వివరాలకు ప్రాధాన్యత ఉండనున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

### రైతులు సహకరించాలి

ప్రైవేట్ సర్వేయర్లు పొలాలకు వచ్చినప్పుడు రైతులు తమ పొలంలో వాస్తవంగా సాగు చేస్తున్న పంట వివరాలను స్పష్టంగా తెలియజేయాలని మండల వ్యవసాయ అధికారి సారిక కోరారు.ఒక పంట సాగు చేసి మరొక పంట పేరును నమోదు చేయించడం లేదా తప్పుడు సమాచారం ఇవ్వడం చేయకూడదని సూచించారు.డిజిటల్ పంటల నమోదులో సరైన వివరాలు నమోదు చేయించుకోవడం ద్వారా భవిష్యత్‌లో పంటల కొనుగోలు ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవచ్చని తెలిపారు.మండలంలోని రైతులందరూ ప్రైవేట్ సర్వేయర్లకు సహకరించి,తమ పొలాల్లో వాస్తవంగా సాగులో ఉన్న పంటనే డీసీఎస్ లో నమోదు చేయించుకోవాలని సారిక విజ్ఞప్తి చేశారు.

# శాంతమ్మ కుటుంబానికి కంఠరెడ్డి. తిరుపతిరెడ్డి ఆర్థిక సాయం

**మెదక్ (ప్రజాజ్యోతి)**

మెదక్ పట్టణంలోని దాయరావీధి 17వ వార్డుకు చెందిన రామస్వామి శాంతమ్మ మృతి చెందిన విషయం మడూరి చంద్రమోహన్ గౌడ్ ద్వారా తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి తన తరఫున వారి కుటుంబానికి నాయకుల ద్వారా రూ.5,000 ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్ గౌడ్, తలారి సంతోష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

## ఒక్క ఛాయాచిత్రం వేయి పదాల భావాన్ని తెలియజేస్తుంది: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ఆగస్టు 22:--**

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సంగారెడ్డి కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో ఫోటో జర్నలిస్ట్ ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అతిథులు ఫోటో జర్నలిస్టులందరికీ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, తనకు ఫోటోగ్రఫీ అంటే ఎంతో ఇష్టమని తెలిపారు. చిన్నతనంలో రీల్ కెమెరాలతో ఫోటోలు తీసి, అనంతరం ఫోటో ల్యాబ్‌కు వెళ్లి వాటిని ప్రింట్ చేయించుకునే రోజులను గుర్తు చేసుకున్నారు. జీవితంలో కొన్ని ఛాయాచిత్రాలు ఎప్పటికీ మరిచిపోలేని జ్ఞాపకాలుగా నిలిచిపోతాయని, అవి మరింత స్ఫూర్తిని కలిగిస్తాయని అన్నారు.ఒకే ఫోటోను ఒక్కొక్కరు ఒక్కో విధంగా అర్థం చేసుకుంటారని, ఒక్క ఛాయాచిత్రం ద్వారా ప్రజల్లోనూ, ప్రభుత్వ యంత్రాంగంలోనూ కదలిక తీసుకురాగల సందర్భాలు ఎన్నో ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. నేటి కాలంలో వార్తాపత్రికల్లో ఫోటోకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఒక వార్తను చదివే ముందు చాలామంది ముందుగా ఫోటోను చూసి ఆ వార్త ప్రాధాన్యతను అంచనా వేస్తున్నారని అన్నారు. అనేక భావాలు, విషయాలను ఒక్క ఛాయాచిత్రం ద్వారా తెలియజేయవచ్చని తెలిపారు.ఫోటోగ్రఫీ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిందని, ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన విధంగా ఫోటోలు తీసుకునే అవకాశం ఉందన్నారు. ఫోటో జర్నలిస్టులు ప్రజా సమస్యలకు సంబంధించిన అంశాలతో పాటు సమాజానికి ఉపయోగపడే మంచి అంశాలను కూడా తమ కెమెరాల్లో బంధించాలని సూచించారు. సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరిస్తూ ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని ఛాయాచిత్రాల ద్వారా అందించాలని కోరారు.జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, ఫోటో జర్నలిస్టులు ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ లోని ఫోటోలను చూస్తుంటే గతంలో జరిగిన అనేక సంఘటనలు కళ్లముందు ఫ్లాష్‌బ్యాక్‌లా కనిపించాయని అన్నారు. వివిధ అంశాలకు సంబంధించిన ఫోటోలు ప్రదర్శనలో ఉన్నాయని, వెయ్యి పదాలు చెప్పలేని విషయాన్ని ఒక్క ఫోటో ఎంతో సులభంగా అర్థమయ్యేలా చెబుతుందని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను కొనసాగించాలని సూచించారు.డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, ఒక ఫోటోను చూడగానే దానికి సంబంధించిన జ్ఞాపకాలు మనసులో మెదులుతాయని అన్నారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా ఎన్నో ఛాయాచిత్రాలను ఎండనక, వాననక నిరంతరం వృత్తి పట్ల అంకితభావంతో ఫోటో జర్నలిస్టులు చిత్రీకరిస్తున్నారని, సమాజ సేవలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఫోటో జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్ మాట్లాడుతూ, మాటలకు అందని భావాలను, అద్భుతమైన క్షణాలను ఒక్క ఫోటో ద్వారా తెలియజేయవచ్చని అన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా నిలుస్తూ ప్రజా సమస్యలను తమ వార్తలు, ఛాయాచిత్రాల




ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తున్న జర్నలిస్టుల కృషి ఎనలేనిదని కొనియాడారు.టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రతినిధి ఎం.ఏ.కే. ఫైసల్ మాట్లాడుతూ, ఫోటో జర్నలిజం రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. కొత్త సవాళ్లను ఎదుర్కొంటూ ఫోటో జర్నలిస్టులు తమ వృత్తి నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు.టి యు డబ్ల్యు జే జిల్లా అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ, ఒక వార్తకు ఫోటో మరింత ప్రత్యేకతను తీసుకువస్తుందని అన్నారు. ఎన్నో సందర్భాల్లో ప్రాణాలను సైతం పణంగా పెట్టి ఫోటో జర్నలిస్టులు తమ విధులను నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. జర్నలిస్టులు, ఫోటో జర్నలిస్టుల సంక్షేమానికి అన్ని విధాలుగా కృషి జరగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర యువజన సంఘాల అధ్యక్షుడు కూన వేణుగోపాల్ మాట్లాడుతూ, ఛాయాచిత్రాలు చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయని అన్నారు. ఫోటో జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.అనంతరం అతిథుల చేతుల మీదుగా ఫోటో జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను అతిథులు, జర్నలిస్టులు, విద్యార్థులు తిలకించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, కౌన్సిలర్ జగన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు జావిద్ అలీ, టి జి ఓ జిల్లా అధ్యక్షుడు వైద్యనాథ్,జిల్లా ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మొహమ్మద్ ఆరిఫ్, కార్యదర్శి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ మురళీ, ఫోటో జర్నలిస్టులు పవన్, సాయి చంద్, కృష్ణ, సతీష్, సంతోష్, కృష్ణ, హరి, రాజ్ కుమార్, చిరంజీవి, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరు నెలల క్రితమే 'ప్రజా జ్యోతి'లో అక్రమాలపై కథనం..

- యథేచ్ఛగా వెంచర్ ప్రహరి గోడ పనులు..- అయినా నిర్లక్ష్యంగా ఉన్న పంచాయతీ అధికారులు..
- అనుమతులు లేకుండానే ప్రహరీ గోడ నిర్మాణం..- అక్రమాలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్...
- వాగులు కబ్జా, చెట్ల నరికివేత విషయంలోనూ సంబంధిత అధికారులు నిర్లక్ష్యం

**కొండాపూర్ ప్రజా జ్యోతి**



మండల పరిధిలోని మన్నాపల్లి గ్రామ శివారులో గల లక్ష్మ రెడ్డి గూడెం గేట్ సమీపంలో వెంచర్ పేరుతో జరుగుతున్న పనులపై ఆరు నెలల క్రితమే 'ప్రజా జ్యోతి' దినపత్రికలో అక్రమాలపై కథనం ప్రచురితమైనా సంబంధిత అధికారులు నేటికీ చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వెంచర్‌లో పనులు మరింత వేగంగా కొనసాగుతున్నాయని ఆరోపిస్తున్నారు.గ్రామపంచాయతీ, హెచ్ఎండీఏ తదితర సంబంధిత అనుమతులు పూర్తిగా పొందకముందే ప్రహరీ గోడ నిర్మాణ పనులు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కేవలం నాలా కన్వర్షన్ ప్రక్రియ పూర్తికాకముందే వ్యవసాయ భూముల్లో జేసీబీలు, ట్రాక్టర్లతో భూమిని లెవెలింగ్ చేస్తున్నారని చెబుతున్నారు.

### చెట్ల నరికివేతపై ఫారెస్ట్ అధికారుల చర్యలేవి?

వెంచర్ ఏర్పాటవుతున్న ప్రాంతంలో వేప, తుమ్మ తదితర చెట్లను జేసీబీలతో పెకిలించి తొలగించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొన్ని చెట్లను పెకిలించి వాగుల్లోకి నెట్టివేశారని అంటున్నారు. అనుమతులు లేకుండా చెట్లను తొలగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇప్పటివరకు ఎలాంటి చర్యలు కనిపించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

### వాగులు, కాలువల పూడ్చివేతపై ఆరోపణలు


ప్రజాజ్యోతి

27 Mar 2026 - Page 5

**అధికారులారా అక్రమాలు చూడండి**

- అనుమతులు లేకుండానే వెంచర్ ఏర్పాటుకు సిద్ధం
- వెంచర్ ఏర్పాటుకు అడ్డుగా ఉన్నాయని వందల ఎకరాల్లో చెట్లు తొలగింపు
- ఇంతలా జరుగుతుంటే ఫారెస్ట్ అధికారుల నిర్లక్ష్యం ఎందుకు-తొలగించిన చెట్లను వాగులోకి తోసివేత
- వాగులు కాలువలు మూసి వేయడానికి సర్వం సిద్ధం
- ఇరిగేషన్ అధికారులు ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి
- ప్రధాన రహదారి పక్కనే అక్రమాలు-ఒక ఎకరా ఐదు కోట్ల విలువైన భూమి
- అసంపూర్తిగా నాలా కన్వర్షన్ - మన్నాపల్లి గ్రామ శివారులో సంఘటన

కొండాపూర్ ప్రజా జ్యోతి:

వెంచర్‌కు సంబంధించిన భూముల్లో సుమారు రెండు పెద్ద వాగులు, నాలుగు చిన్న వాగులు ఉన్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. చిన్న వాగులను పూర్తిగా మూసివేశారని, పెద్ద వాగులను సైతం పూడ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి పరిసర ప్రాంతాలకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



### ఇరిగేషన్ అధికారుల తీరుపై విమర్శలు

వాగులు, కాలువలకు సంబంధించిన విషయంపై అధికారులు స్పందించాల్సి ఉన్నప్పటికీ, తమకు సమాచారం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వాగులు, కాలువలు, కుంటలను ఆక్రమించినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిశీలన ఎప్పుడు చేపడతారో స్పష్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### ఆన్‌లైన్‌లోనే ప్లాట్ల విక్రయ ప్రచారం

వెంచర్ పనులు ఇంకా ప్రారంభ దశలోనే ఉండగా ప్లాట్ల విక్రయానికి ఆన్‌లైన్‌లో ప్రచారం జరుగుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. పూర్తి అనుమతులు, లేఅవుట్ నిబంధనలు, భూ వినియోగ మార్పులు తదితర అంశాలను పరిశీలించకుండా ప్లాట్లు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

### సర్వే నంబర్లపై అధికారులు దృష్టి సారించాలి

మన్నాపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 36, 37, 42, 43, 44, 47, 48, 49, 50, 51, 52, 53, 54, 80, 81, 82, 83, 84, 85కు సంబంధించిన భూముల్లో పనులు జరుగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత వ్యక్తులు, సంస్థల పేర్లతో భూముల రిజిస్ట్రేషన్లు ఉన్నాయని చెబుతున్నారు.

### ఆరు నెలలుగా పంచాయతీ అధికారుల స్పందన ఏది?

'ప్రజా జ్యోతి'లో ఆరు నెల క్రితమే అక్రమాలపై కథనం ప్రచురించినప్పటికీ అధికారులు స్పందించకపోవడం పంచాయతీ, రెవెన్యూ, ఇరిగేషన్, అటవీ, హెచ్ఎండీఏ అధికారుల పనితీరుపై ప్రశ్నలు తలెత్తేలా చేస్తోందని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# గ్రామాల అభివృద్ధిలో యువతే కీలక పాత్ర

**జహీరాబాద్, ఆగస్టు 22 (ప్రజా జ్యోతి న్యూస్)**

పట్టణములోని మహిళా కాంగ్రెస్ కార్యలయం లో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలతో స్వచ్ఛందంగా సామాజిక కార్యక్రమాలు చేస్తున్న నాయకుల సమావేశం. సమావేశానికి ఉద్దేశించి జహీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా మట్లాడుతూ గ్రామాలలో యువత స్వచ్ఛందంగా సేవ చేయడం చాలా సంతోషదాయకమని, గ్రామా లలో ఉన్న సమస్యలను తమ సామర్థ్యం కొలది పరిష్కరిస్తూ మరియు ఇతర ఏవైన సమస్యలుంటె సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్ళాలని, గ్రామాలలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమా లకు తావివ్వకుండ, చెడు వ్యసనాలకు మరియు అనవసరమైన బెట్టింగ్ అప్స్ జోలికి పోకూడదని గ్రామాల్లో అవగాహన కల్పించా లని అన్నారు. అర్హులైన వారిని పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు చేరేలా సంస్థ నాయకులు బాధ్యతలు తీసుకో వాలని, ఎవరికి తోచినరీతిగా వారు కార్యక్రమాలు చేయకుండా నియోజకవర్గంలో స్వచ్ఛందంగా చేస్తున్న కార్యక్రమాలకు ఒక్క సమూహంగా ఎర్పడి జహీరాబాద్ నియోజక వర్గ అభివృద్ధికి ఒక ఏజెండానూ రూపొందించ చాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గోన్న వారికి మరిన్ని కార్యక్రమాలు చేసే విధంగా ఆర్థిక సహాయం మరియు యూనిఫార్మిటిని అందించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, రాములు, భాగవత్, సోహెల్, శ్రీకాంత్, భాను ప్రసాద్, ఆసిఫ్ మియా, గుండప్ప, కల్లెప్ప, కృష్ణ చారి, అవినాష్ రెడ్డి, మోహన్ రాథోడ్ తదితరులు పాల్గోన్నారు.



# గనుల పత్రాలు డిజిటలైజేషన్ పూర్తి..

## - బి ఎల్ ఓలకు తాసిల్దార్ అశోక్ సన్మానం...

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

మండలంలోని మొత్తం 46 పోలింగ్ కేంద్రాల్లో గణన పత్రాల డిజిటలైజేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా శనివారం బి ఎల్ ఓ సూపర్‌వైజర్లు, బి ఎల్ ఓ లను ఘనంగా సన్మానించారు. తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, గణన పత్రాల డిజిటలైజేషన్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయడంలో బి ఎల్ ఓ సూపర్‌వైజర్లు, బి ఎల్ ఓ లు ఎంతో కృషి చేశారని అధికారులు అభినందించారు. ఎన్నికల ప్రక్రియలో కీలకమైన బాధ్యతలను సమన్వయంతో నిర్వహించినందుకు వారి సేవలను ప్రశంసించారు. ఈ సన్మాన కార్యక్రమంలో కొండాపూర్ మండల తహసీల్దార్ అశోక్, ఎంపీడీవో సౌమ్య శ్రీ, డిప్యూటీ తహసీల్దార్,విశ్వేశ్వర్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



# అబద్ధపు కేసులపై జాతీయ సదస్సు

## - గీతం కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ ఆధ్వర్యంలో రెండు రోజుల చర్చా వేదిక






**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)**

అబద్ధపు కేసుల భావన, వాటి చుట్టూ నెలకొన్న న్యాయ, సామాజిక, దర్యాప్తు సంబంధిత సంక్లిష్టతలను విమర్శనాత్మకంగా పరిశీలించేందుకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కెఎస్‌పీపీ) రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించింది. ఆగస్టు 21, 22 తేదీల్లో యుగాంతర్, ఐఐఐటీ హైదరాబాద్, భూమిక ఉమెన్స్ కలెక్టివ్ సంయుక్త సహకారంతో ఈ సదస్సు జరిగింది.

భారతీయ మహిళా హక్కుల న్యాయవాది, కార్యకర్త, రచయిత్రి, మజ్లిస్ సహ వ్యవస్థాపకురాలు ఫ్లావియా ఆగ్నెస్ కీలకోపన్యాసం చేశారు. గృహ హింస, లింగ సమానత్వం వంటి అంశాల్లో తప్పుడు కేసుల భావన చుట్టూ ఉన్న ఆందోళనలను ఆమె ప్రస్తావించారు.

సదస్సులో వివాహ చట్టం, పోక్సో, మానవ అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, అత్యాచారాలు, అఘాయిత్యాల నిరోధక చట్టం, గృహ హింస చట్టాల్లో తప్పుడు కేసులపై ఉన్న సమాచారం, ప్రచార కథనాలను పరిశోధకులు విశ్లేషించారు. పోలీసు ఫిర్యాదుల అనుభావికత, తప్పుడు కేసులపై ప్రజా చర్చ తదితర అంశాలపై ప్యానెల్ చర్చలు నిర్వహించారు.

జస్టిస్ ముక్తా గుప్తా ప్రత్యేక సమావేశంలో పాల్గొని న్యాయపరమైన దృక్పథాన్ని వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఆకట్టుకున్నాయి. తొలుత డాక్టర్ వసుధా కట్టు స్వాగతం పలకగా, కెఎస్‌పీపీ డీన్ సయ్యద్ అక్బరుద్దీన్ ప్రారంభోపన్యాసం చేశారు. గాయత్రి కెర్మెవత్ వందన సమర్పణ చేశారు.

# ఫోటో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి !

## - అర్హులైన వారిని ఆదుకోవాలి

## - టియుడబ్ల్యూజే (ఐజేయు)

## జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి వినతి





**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

ఫోటో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని టియుడబ్ల్యూజే ఐజేయు సంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షుడు బండారు యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏకే ఫైసల్ కోరారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్లో శనివారం ఫోటోల ప్రదర్శనను నిర్వహించారు అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి, అదనపు కలెక్టర్ పాండు, డిపిఆర్ఓ విజయలక్ష్మి, జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు వైద్యనాథ్,బిజెపి సీనియర్ నాయకుడు కొండాపురం జగన్, యువజన సంఘాల నాయకుడు కూన వేణు, ఫోటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు ఆరిఫ్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఇతర ముఖ్యులు సంతోష్, పవన్, రాజు, కృష్ణ, మురళి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ స్పాట్ ఫోటోల కోసం, ప్రజా సమస్యలను మరింత త్వరగా వెలుగులోకి తెచ్చేందుకు ఫోటో జర్నలిస్టులు ప్రాణాలకు తెగించి పనిచేస్తున్నారని అన్నారు. వర్కింగ్ జర్నలిస్టులతో పాటు ఫోటో జర్నలిస్టులు కలిసి పనిచేయడం వల్లనే అనేక ప్రజా సమస్యలు వెలుగులోకి వస్తున్నాయని చెప్పారు. అంతేకాకుండా ప్రభుత్వ కార్యక్రమాలు కూడా ప్రజల్లోకి ఉధృతంగా వెళుతున్నాయని అన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని, ఫోటో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా అర్హులైన ఫోటో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా చాలా మంది పనిచేస్తున్నప్పటికీ, వారికి కనీసం విలువ నీడ కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాన్ని కాపాడుకునే పరిస్థితులు కూడా లేవని అన్నారు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే, అనారోగ్యం బారిన పడితే, వైద్యం చేయించుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అందువల్ల హెల్త్ కార్డును కూడా అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వానికి నివేదిస్తామని, అర్హులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఏదైనా సమస్య ఉన్నప్పుడు తనను కలిస్తే, చేతనైనంత మేరకు అండగా ఉంటామని బదులిచ్చారు. ఎలాంటి అధైర్య పడొద్దని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు యాదగిరిని, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏకే ఫైసల్ ను ఫోటో జర్నలిస్టు సంఘం నాయకులు సన్మానించారు. మెమెంటోను అందజేశారు. పలువురు జర్నలిస్టు సంఘం నాయకులు, మీడియా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిహెచ్ ఎస్ బాలుర మండల స్థాయి ప్రాథమిక ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం





**జహీరాబాద్, ఆగస్టు 22 (ప్రజా జ్యోతి న్యూస్)**

నియోజకవర్గ కోహిర్ మండల స్థాయి ప్రాథమిక ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం జిహెచ్ ఎస్ బాలురు కోహిర్ నందు విజయ వంతంగా ముగిసింది. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యా యులు శారద మేడం బిలాల్పూర్ ప్రధానో పాధ్యాయులు సుచరిత హాజరై ఉపాధ్యా యుల పనితీరు, పాఠశాలల్లో అమలవుతున్న ఎఫ్ ఎల్ ఎన్(ఖీంచీ)అమలు తీరు మరియు రికార్డ్స్,రిజిస్టర్ లను వివరించడం జరిగింది. ఆర్ పి సింహాచలం ఎఫ్ ఎల్ ఎన్ బేస్ లైన్ టెస్ట్ గురించిన వివరాలు పాఠశాలల వారిగా డిస్కస్ చేశారు.అనంతరం ఆర్ పి రాజ్ కుమార్ మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ పి జి ఐ ఇండికేటర్స్ ను వివరించి మన రాష్ట్ర, జిల్లా స్థాయిలను వివరించారు. భోజన విరామం అనంతరం డా. సి ఎస్ వేప ాూ× టూల్స్ గురించి వివరించారు. తర్వాత పండరి ా=ూూనాూూం యాప్ గురించి వివరించారు. తర్వాత ఇబ్రహీం ఏ ఎక్స్ ఎల్ టార్గెట్ సెట్టింగ్ గురించి వివరించారు. ఎంఈఓ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రాథమిక ఉపాధ్యా యులకు తెలుగు, గణితం మరియు ఇంగ్లీష్ లలో కాంపిటెన్సీస్ లను అమలు చేయాలని, ఎఫ్ ఎల్ ఎన్ అబ్జర్వేషన్ టీమ్మ్స్ మరియు ప్యానెల్ ఇన్స్పెక్షన్ టీమ్ లకు సహకరించి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటు పడాలని సూచనలు చేశారు. సమాజం లోని నూతన పోకడలను పరిశీ లిస్తూ, నిరంతరం కొత్త విషయాలు నేర్చుకొని తమ వృత్తిపర మైన అభివృద్ధిపొంది, విద్యార్థులకు నాణ్య మైనవిద్యను అందించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా డా. సి ఎస్ వేప గారిని మరియు ఈ నెలలో పదవి విరమణ పొందుతున్న ఎల్ ఎఫ్ ఎల్ కవేలి ప్రదానో పాధ్యాయులు దొండి రావు ని కాంప్లెక్స్ తరపున ఘనంగా సన్మానించారు.

# రూ.15లక్షల ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే మాణిక్ రావు

**జహీరాబాద్, ఆగస్టు 22 (ప్రజా జ్యోతి న్యూస్)**

అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కవెల్లి గ్రామానికి చెందిన మాణిక్ రావు తండ్రి పద్మ రావు 5,00,000/-, పస్తాపూర్ గ్రామానికి చెందిన అనిల్ తండ్రి మొగులయ్య గారికి 5,00,000/-, గుంతమర్పల్లి గ్రామానికి చెందిన రాజు గౌడ్ కి 5,00,000/-, అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మొత్తం రూ.15 విలు వైన ఎల్ఓసి మంజూరు చేయించారు. మంజూ రైన ఎల్ఓసి శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జహీరాబాద్ శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు లబ్ధిదారుడికి అంద జేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు మరియు కుటుంబ సభ్యులు తమకు ఆపద సమయంలో అండగా నిలిచి, వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు కి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



# జోగు సంగీతకు న్యాయం చేయాలి

## - ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ చైర్మన్ నవోదయ సిద్దార్థ

**సంగారెడ్డి ప్రజా జ్యోతి:**

సంగారెడ్డి, ఆగస్టు 21: కంగ్టి మండలం దెగుల్‌వాడి గ్రామానికి చెందిన జోగు సంగీత హత్య కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేసి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ చైర్మన్ నవోదయ సిద్దార్థ డిమాండ్ చేశారు. కేసులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం వర్తించే విధంగా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌ను కలిసి కేసు వివరాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జోగు సంగీత హత్యకు సంబంధించిన పూర్తి వివరాలను ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరగా, కమిషన్ చైర్మన్ స్పందించి సంగారెడ్డి జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. అనంతరం ఎస్పీని కలిసి కేసు పరిస్థితి, బాధిత కుటుంబం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించినట్లు తెలిపారు.తనతో జరిగిన చర్చ సందర్భంగా ఎస్పీ పరితోష్ పంకజ్ నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, కంగ్టి సిఐ వెంకట్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి, జోగు సంగీత హత్య కేసులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, చట్టపరమైన నిబంధనల మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని సూచించినట్లు వెల్లడించారు.సంగీత కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ కార్యాలయాన్ని ఆశ్రయించి వినతిపత్రం సమర్పించారని తెలిపారు. వారి విజ్ఞప్తి మేరకు ఈ నెల 2న దెగుల్‌వాడి గ్రామానికి వెళ్లి సంగీత కుటుంబాన్ని పరామర్శించి, వారి పరిస్థితిని తెలుసుకున్నట్లు చెప్పారు.కేసు దర్యాప్తులో జాప్యం జరుగుతోందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేయడంతో కంగ్టి పోలీస్ స్టేషన్ ఎస్సైని కలిసి కేసు పురోగతిపై వివరాలు తెలుసుకుని, విచారణను వేగవంతం చేయాలని కోరినట్లు తెలిపారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని,జోగు సంగీత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కేసు దర్యాప్తు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగాలని, నిందితులు ఎవరైనా చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు సంస్థ తరపున తమ పోరాటం కొనసాగుతుందని ఆయన తేల్చిచెప్పారు.



# పోలీసుల దాడిలో గిరిజనుడికి గాయాలు

## - కల్హేర్ పోలీస్ స్టేషన్ ఎదుట బంధువుల ఆందోళన

## - బాధ్యులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హామీ

**కల్హేర్, ఆగస్టు 22 (ప్రజాజ్యోతి):**



వాహనాల తనిఖీల సందర్భంగా పోలీసులు విచక్షణారహితంగా దాడి చేయడంతో ఓ గిరిజనుడికి గాయాలైన ఘటన సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలో చోటుచేసుకుంది. బాధితుడి బంధువులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. ఇందిరా నగర్ కల్హేర్.ప్రాంతానికి చెందిన తులసీరాం శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగినట్లు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు, వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో ఓ వ్యక్తి పోలీసులకు దొరకకుండా వెళ్లిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆ వ్యక్తిని పోలీసులు పట్టుకున్న అనంతరం అతడిని విడిచిపెట్టాలని తులసీరాం పోలీసులను వేడుకున్నాడని, ఈ క్రమంలో పోలీసులు అతడిపై లాఠీలతో దాడి చేశారని ఆరోపించారు. పోలీసుల దాడిలో తులసీరాం తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లినట్లు తెలిపారు.

గాయపడిన తులసీరాంను వెంటబెట్టుకుని ఇందిరానగర్ తండా, కల్హేర్, ఇందిరానగర్ గ్రామాలకు చెందిన ప్రజలు శుక్రవారం రాత్రి కల్హేర్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఇందిరానగర్ సర్పంచ్ సంగయ్యతో పాటు పలువురు గ్రామస్థులు ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు.విషయం తెలుసుకున్న కల్హేర్ ఎస్ఐ రవిగౌడ్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ఘటనపై విచారణ జరిపి, తప్పు ఎవరిదైనా ఉపేక్షించబోమని, బాధ్యులుగా తేలిన పోలీసులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు తమ ఆందోళనను విరమించారు.

అనంతరం గాయపడిన తులసీరాంను మెరుగైన చికిత్స కోసం నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.




**పోలీసులు ఇష్టం వచ్చినట్లు కొట్టారు: బాధితుడి.**

**అల్లుడు జవహర్లాల్.**

పిట్లం నుంచి వస్తున్న తులసిరామ్పై కల్హేర్లో పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారని అతడి బంధువు జవహర్నాయక్ ఆరోపించారు. వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు ద్విచక్రవాహనాలను ఆపుతుండగా, ఆగకుండా వెళ్లడంతో లాఠీలతో కొట్టారని ఆరోపించాడు.

# MNR యాజమాన్యం తీరుపై విద్యార్థుల ఆగ్రహం..

## ఎమ్మెల్యేను ఆశ్రయించిన విద్యార్థులు, తల్లిదండ్రులు

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :**



ఎంఎన్ఆర్ విద్యాసంస్థ యాజమాన్యం తమకు అన్యాయం చేస్తోందంటూ పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను ఆశ్రయించారు. విద్యార్థులను ఎంఎన్ఆర్ లో చేర్పించే సమయంలో యాజమాన్యం చెప్పిన విధంగానే ఫీజు చెల్లించి అడ్మిషన్లు తీసుకున్నామని తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు వివరించారు.అయితే నెల రోజుల పాటు తరగతులు నిర్వహించిన అనంతరం తమ విద్యార్థుల సర్టిఫికెట్లు ఫేక్ అని యాజమాన్యం పేర్కొంటోందని వారు ఆరోపించారు. ఈ విషయంపై విద్యార్థులు యాజమాన్యాన్ని సంప్రదించేందుకు ప్రయత్నించగా సెక్యూరిటీ సిబ్బందితో బయటకు పంపించారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.తాజాగా విద్యార్థులు తిరిగి విద్యాసంస్థలో కొనసాగాలంటే మరో రూ.2 లక్షల ఫీజు చెల్లించాల్సిందేనని, లేదంటే విద్యాసంస్థలోకి అనుమతించబోమని యాజమాన్యం చెబుతోందని తల్లిదండ్రులు ఆరోపించారు. అడ్మిషన్ సమయంలో పూర్తి ఫీజు వివరాలను తెలుసుకుని, యాజమాన్యం సూచించిన విధంగానే ఫీజు చెల్లించిన తర్వాత మళ్లీ రూ.2 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేయడం సరికాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ వ్యవహారంలో తమ పిల్లల చదువుకు నష్టం కలగకుండా న్యాయం చేయాలని కోరుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను కలిసి తమ సమస్యను వివరించారు.వారి సమస్యను సానుకూలంగా విన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్ వెంటనే ఎంఎన్ఆర్ యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యార్థులకు అన్యాయం జరగకూడదని, వారి విద్యకు ఆటంకం కలగకుండా సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ అంశంపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు సోమవారం ఎంఎన్ఆర్ యాజమాన్యం తనను కలవాలని ఎమ్మెల్యే సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల సమస్యను పరిశీలించి, వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ భరోసా కల్పించారు.